'ఖని'లో రోడ్డు ప్రమాదం.. పోరండ్లలో విషాదం

తండ్రీ కొడుకులు సతీశ్, నవీశ్ (ఫైల్)

- గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు దుర్మరణం

తిమ్మాపూర్, జనవరి 13: డ్యూటీకి సమయానికి వెళ్లాలనే ఆతృతలో వెళ్తున్న ఓ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం విచ్ఛిన్నం చేసింది. ఆగిఉన్న లారీని ఢీకొన్న ఘటనలో మండలంలోని పోరండ్ల గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు సతీశ్, నవీశ్ మరణించడంతో పాటు సతీశ్ భార్య, సోదరి, బావ గాయాలతో చికిత్స పొందుతుండడంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు.. పోరండ్ల గ్రామానికి చెందిన సతీశ్(32) సింగరేణి కార్మికుడు. కుటుంబంతో యైటింక్లయిన్‌కాలనీ అంబేద్కర్‌నగర్‌కు నివాసం ఉంటున్నాడు. బంధువులు హైదరాబాద్‌లోని హాస్పిటల్‌లో ఉండగా చిన్న కొడుకు నవీశ్ (11నెలలు), భార్య, ఆయన చెల్లె, బావతో కలిసి ఆదివారం వెళ్లాడు. తిరిగి రాత్రి పోరండ్లకు చేరుకుని కొద్దిసేపు ఇంటి వద్ద గడిపారు. సోమవారం తెల్లవారుజామున సతీశ్‌కు డ్యూటీ ఉందని అర్ధరాత్రి సమయంలో మళ్లీ గోదావరిఖనికి బయల్దేరారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 3గంటల సమయంలో గాంధీనగర్ వంకబెండు రహదారిపై కుక్క అడ్డుగా రాగా, దానిని తప్పించబోయి రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో కారు నడుపుతున్న సతీశ్‌తోపాటు నవీశ్ అక్కడికక్కడే మరణించాడు. ఆయన భార్య, చెల్లె, బావ హాస్పిటల్‌లో తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. సతీశ్, నవీశ్ అంత్యక్రియలను సోమవారం సాయంత్రం పోరండ్లలో నిర్వహించారు. సతీశ్ తండ్రి రెండేండ్ల కింద చనిపోగా.. ఆయన వారసత్వంగా ఏడు నెలల కిందనే ఉద్యోగంలో చేరాడు. తండ్రీ కొడుకులకు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించగా, గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం

వీణవంక, జనవరి 13: ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి కరీంనగర్ పోలీసులు అక్రమంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వ్యక్తిని ప్రశ్నించడం తప్పా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిత్యావసరాలు అందజేత

తిమ్మాపూర్, జనవరి 13: మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో ఆదివారం కెనాల్‌కు గండితో ఇబ్బంది పడిన గ్రామస్తులకు ప్రభుత్వం నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. ఎమ్మెల్యే కవ్వంపల్లి ఆదేశాలతో 30 కుటుంబాలకు పది కిలోల చొప్పన బియ్యంతో పాటు నూనె, పప్పులను స్థానిక నాయకులతో కలిసి ఆర్ఐ అందజేశారు. సుధగోని లక్ష్మీనారాయణగౌడ్, కనకయ్య, శ్రీనివాస్, పార్నంది దుర్గయ్య, కిరణ్, పొట్ట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొత్తపల్లి, జనవరి 13: సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను మాజీ వైస్ ఎంపీపీ భూక్యా తిరుపతినాయక్ సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక ఎంఎల్ఏ గంగుల కమలాకర్ సహకారంతో చింతకుంట గ్రామానికి చెందిన ఐదుగురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, వాటిని ఇంటింటికి తిరిగి అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు గుర్రాల జయప్రకాశ్‌రెడ్డి, నాయకులు చిన్న రాజు, సన్ని తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా.. భోగి సంబురాలు

హుజూరాబాద్ టౌన్: సిద్ధార్థనగర్‌లో భోగిమంటలు వేసిన కాలనీ వాసులు

తిమ్మాపూర్: నుస్తులాపూర్‌లో భోగి వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌లో చిన్నారికి బోడ పళ్లు, పూలు పోస్తున్న మహిళలు

నగరంలోని 33వ డివిజన్‌లో భోగి వేడుకల్లో పాల్గొన్న మహిళలు

గన్నేరువరం: పారువెల్లలో భోగి మంటలు వేస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి/హుజూరాబాద్ టౌన్/తిమ్మాపూర్/గన్నేరువరం, జనవరి 13 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం భోగి సంబురాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. నగరంలోని 33వ డివిజన్‌లో భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేయర్ వై సునీల్ రావు సతీమణి అపర్ణాసునీల్‌రావు ఆధ్వర్యంలో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కొత్తపల్లి మండలం బద్దిపెల్లి స్వయంభూ అలివేలు మంగ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు తిరుపతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, విజేతలతోపాటు పాల్గొన్న 55 మందికి ప్రోత్సాహక బహుమతులు అందించారు. హుజూరాబాద్ పట్టణంలోని సిద్ధార్థనగర్, మారుతీనగర్ సహా పలు కాలనీల్లో భోగి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ప్రజలంతా ఒక్క దగ్గరికి చేరి భోగి మంటలు వేసి, నృత్యాలు చేశారు, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమాల్లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సిద్ధార్థ నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సాగి వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి బండ సంపత్ రెడ్డి, పీడీ రాజిరెడ్డి, జి రవీందర్, లింగారావు, జయవర్ధన్, మంచికట్ల శ్రీనివాస్, రాజమౌళి, ఎం రాజిరెడ్డి, మహిళలు, పిల్లలు పెద్దఎత్తున పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్, రామకృష్ణకాలనీ, తదితర గ్రామాల్లో ఇండ్ల ఎదుట మహిళలు ఉదయాన్నే రంగురంగుల ముగ్గులు వేశారు. చిన్నారులు గొబ్బెమ్మలు పెట్టి ఆనంద పడ్డారు. చిన్నారులను భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలో సోమవారం రాత్రి భోగి మంటలు వేశారు. పెద్దలు, పిల్లలు భోగి మంట చుట్టూ చేరి సందడి చేశారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో అట్టహాసంగా..

భోగి మంటలు వేస్తున్న వైద్యులు

విద్యానగర్, జనవరి 13 : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కరీంనగర్ బ్రాంచి ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు కరీంనగర్‌లోని ఐఎంఏ హరితహారం గ్రౌండ్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని, రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. హరిదాసు కీర్తనలు అలరించాయి. ముగ్గుల పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పెద్ద ఎత్తున మహిళా వైద్యులు, సీనియర్ వైద్యులు పాల్గొని సంక్రాంతి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎనమల్ల నరేశ్, నవీన్‌కుమార్, కోశాధికారి విజయ్‌కుమార్, అలీంతో పాటు సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబురాలు జరుపుకొంటున్న వైద్యులు

సగర సంఘం జిల్లా అధ్యక్షుడికి అల్లం నారాయణ అభినందన

వీణవంకలో సగరసంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

వీణవంక, జనవరి 13: సగర సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన దేవునూరి శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అభినందించారు. మండలంలోని శ్రీరాములపేట గ్రామానికి చెందిన దేవునూరి శ్రీనివాస్ ఇటీవల జరిగిన సగర సంఘం ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికకాగా, సోమవారం జిల్లా పర్యటనలో భాగంగా వీణవంక మండల కేంద్రానికి వచ్చిన అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి అస్కాని మారుతి సగరతో కలిసి శ్రీనివాస్‌కు శాలువాకప్పి, అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం తన కలంతో ప్రభుత్వాలనే కదిలించిన గొప్ప వ్యక్తి మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అని ఈ సందర్భంగా సగర సంఘం జిల్లా అధ్యక్షుడు కొనియాడారు. అనంతరం అల్లం నారాయణతో పాటు అస్కాని మారుతి సగరను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సగర సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ఏరుకొండ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మందా జగన్నాథంకు నివాళి

హుజూరాబాద్ టౌన్, జనవరి 13: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం చిత్రపటానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి, మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడిగా సుదీర్ఘకాలం పాటు ప్రజలకు సేవలందించిన మందా జగన్నాథం మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వేల్పుల రత్నం, పాడిశెట్టి వెంకటరాజం, రుద్రారపు రామచంద్రం, డాక్టర్ శేఖర్, వేల్పుల ప్రభాకర్, తునికి వసంత్, కట్కూరు రాజేందర్, సందెల వెంకన్న, రామ్ రాజేశ్వర్, అకినపల్లి ప్రవీణ్, సిరికొండ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారువెల్లలో కొండ చిలువ ప్రత్యక్షం

గ్రామస్తులు హతమార్చిన కొండచిలువ

గన్నేరువరం, జనవరి 13: పారువెల్ల గ్రామంలో కొండ చిలువ ప్రత్యక్షం కావడం కలకలం రేపింది. తీవ్రమైన చలి నేపథ్యంలో వర్కోలు గిరిధర్ తన మిత్రులతో కలిసి సోమవారం ఇంటిఎదుట చలిమంట పెట్టుకున్నారు. ఈ క్రమంలో చెట్ల పొదల నుంచి కొండచిలువ రావడాన్ని గమనించి పిల్లలు భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆ కొండచిలువ బాత్రూంలోకి చొరబడగా, గ్రామస్తులతో కలిసి కర్రలతో చంపేశారు. గ్రామంలో గతంలో ఎప్పుడూ కొండచిలువల ఆనవాళ్లు లేవని గ్రామస్తులు చెబుతున్నారు.

'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు' సన్నాహక సదస్సు

కొత్తపల్లి, జనవరి 13 : 'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు' సభ సన్నాహక సదస్సును సోమవారం మండలంలోని బావుపేట గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జానపద కళాకారుడు రామంచ భరత్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు అమలు కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన 'వెయ్యి గొంతులు.. లక్ష డప్పులు' సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బీ అనిల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు సాగర్, రాజన్న, ప్రభాకర్, సంతోష్, దుర్గమల్లు, నర్సయ్య, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు
కరీంనగర్ జిల్లా ప్రజలకు , ప్రజాప్రతినిధులకు, నాయకులకు, అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు సంక్రాంతి శుభాకాంక్షలు
MPDO ,MPO
మండల పంచాయతీ కార్యదర్శులు

క్రీడలతో వ్యసనాలకు చెక్

తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో మాట్లాడుతున్న సీఐ స్వామి

తిమ్మాపూర్, జనవరి13: మండలంలోని రామకృష్ణకాలనీలో సోమవారం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను తిమ్మాపూర్ సీఐ కర్ర స్వామి, ఎల్ఎండీ ఎస్ఐ తాండ్ర వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ స్వామి మాట్లాడుతూ, క్రీడలతో వ్యసనాలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. నాయకులు క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. అలాగే, గ్రామానికి చెందిన ఊబిది రాజ్‌కుమార్ సెంట్రల్ పోలీస్ ఉద్యోగం సాధించగా ఆయనను వారు అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు భూతం శ్రీకాంత్, రాకేశ్, కిన్నెర శ్రీనివాస్, కళ్లెం అజయ్, కిన్నెర వెంకటేశ్, నాయకులు మీసాల అంజయ్య, సుగుర్తి జగదీశ్వరాచారి, గుజ్జుల ప్రణీత్‌రెడ్డి, పోలం మల్లేశ్, వేల్పుల ఓదయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో..

తిమ్మాపూర్ గ్రామంలో మాతంగి శంకర్ ఆధ్వర్యంలో ఆయన తల్లిదండ్రులు కాంతమ్మ, మల్లయ్య స్మారకార్థం క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయగా, ఎల్ఎండీ ఎస్ఐ తాండ్ర వివేక్ ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి ఎస్ఐ కొద్దిసేపు ఆడారు. తరచూ ఆటలాడాలని సూచించారు. నిర్వాహకుడు శంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుండ్ర రాజయ్యాయాదవ్, నాయకులు పోలు రాము, రమేశ్, బొర్ర వంశీ, చిలుకూరి అనిల్, పోతురాజు దేవేందర్, ఆరు జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.

చేగుర్తిలో

కరీంనగర్ రూరల్, జనవరి 13: చేగుర్తిలో అట్ల మల్లయ్య జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్‌ను నాయకుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అట్ల అనిల్‌యాదవ్, మరం సంపత్, అనిల్, అంజి, మురళి, విజయ్, సాయి, శ్రీనివాస్, లక్ష్మణ్‌బాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

19న జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు

కొత్తపల్లి, జనవరి 13 : జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాల బాలికల కబడ్డీ పోటీలను ఈనెల 19న హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సీహెచ్ అమిత్‌కుమార్, బి. మల్లేశ్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16 సంవత్సరాల్లోపు వయసు, 55 కేజీల్లోపు బరువు ఉన్న క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఒరిజినల్ ఆధార్ కార్డ్‌ను వెంట తీసుకొని రావాలని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

శంకరపట్నం, జనవరి 13: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొమిరె తిరుపతి ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కి కళ్లు గీసే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పొలంలో పడ్డాడు. తీవ్ర గాయాలైన తిరుపతి అరుపులకు దారిన వెళ్తున్న యువకులు వెంటనే వచ్చి 108 వాహనంతో పాటు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు వచ్చి అంబులెన్స్‌లో అతడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు.

కేశవపట్నం రైతు వేదికలో చోరీ

శంకరపట్నం, జనవరి 13: మండల కేంద్రంలోని రైతు వేదిక మందిరంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రైతు వేదిక తలుపులు పగులగొట్టి అందులో గల ఆడియో సౌండ్ బాక్సులను ఎత్తుకెళ్లినట్లు సమాచారం. ఈ మేరకు క్లస్టర్ ఏఈవో స్రవంతి కేశవపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కాగా, గతంలో సైతం ఇదే రైతు వేదిక కిటికీలు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి విలువైన వస్తువులు చోరీ చేశారు.

రైతుల ఉద్యానవన టూర్

శంకరపట్నం, జనవరి 13: మండలానికి చెందిన పలువురు రైతులు సోమవారం బొల్లారం రాష్ట్రపతి నిలయానికి ఉద్యానవన టూర్‌కు బయలుదేరి వెళ్లారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో జిల్లా నుంచి దాదాపు 200 మంది రైతులు ఈ టూర్‌కు వెళ్తుండగా, శంకరపట్నం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 10 మంది రైతులు ఇందులో ఉన్నట్లు ఏవో వెంకటేశ్ తెలిపారు. ఇక్కడ వారు హార్టికల్చర్‌కు సంబంధించిన ఫ్లవర్స్, ఫ్లోరికల్చర్ సాగు విధానాలు, పూల మొక్కలు తదితర మొక్కల సాగును పరిశీలించనున్నట్లు తెలిపారు.

ప్రతి వాహనదారుడు రోడ్డు నిబంధనలు పాటించాలి

శంకరపట్నం, జనవరి 13: ప్రతి వాహనదారుడు రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలను తప్పక పాటించాలని కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం తాడికల్ గ్రామంలో ఆటో డ్రైవర్లు, యువకులకు రోడ్డు భద్రతా, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇవ్వవద్దని, రోడ్డుపై వాహనం నడిపేటప్పుడు తగిన డాక్యుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్స్, తదితర పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఇక్కడ పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, గ్రామ యువకులు ఉన్నారు.

పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్ నాయకులు

పోలీసుల అదుపులో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులు

హుజూరాబాద్, జనవరి 13: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్ నేపథ్యంలో ఆయనకు మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కరీంనగర్ తరలి వెళ్లకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారు. ప్రస్తుతం తాళ్లపల్లి శ్రీనివాస్, కొలిపాక శ్రీనివాస్, ఎండీ అమ్జద్‌ను పోలీసులు వారి ఇంటికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఇంకా చాలా మంది ముఖ్యమైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. పండుగపూట పోలీసులు నాయకుల ఇంటికి వచ్చి తీసుకువెళ్లడంపై స్థానికులు మండిపడుతున్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు మానేరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి

కొత్తపల్లి, జనవరి 13: కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఈనెల 18 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని పూణేలో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల జూడో చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు విద్యాసంస్థల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన 9వ రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో 57 కేజీలపై విభాగంలో బింగి మన్విత, 60 కేజీల్లోపు విభాగంలో నిషిత్ రెడ్డి బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డితో పాటు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు జహద, శిరీష, తిరుపతి, స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

తెలంగాణచౌక్, జనవరి 13: బ్రాహ్మణ పరిషత్‌ను కార్పొరేషన్ మార్చాలని భారతీయ బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు రాంబట్ల దీపక్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్రాహ్మణుల ఆర్థికాభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి 500 కోట్ల రూపాయలను కేటాయించాలని కోరారు. బీఆర్‌ఎస్ హయాంలో కేటాయించిన నిధులు తప్ప పరిషత్‌కు తిరిగి నిధులు ఇవ్వకపోవడంతో బ్రాహ్మణులకు సంక్షేమ పథకాలు దక్కడం లేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్రాహ్మణులకు బ్యాంకు రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రామారావు, రవీందర్‌రావు, వసంతరావు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

గోడప్రతిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, జనవరి 13 : భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని కోట్ల నర్సింహుపల్లి వీరభద్రస్వామి వార్షికోత్సవాల గోడప్రతిని సోమవారం కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రముఖ్య పర్యాటక కేంద్రంగా విలసిల్లుతున్న కోట్లనర్సింహుపల్లి గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట మల్లారెడ్డి, పబ్బతి తిరుపతిరెడ్డి, రామిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత మల్లారెడ్డిపల్లి జట్టు



వీణవంకలో వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, నాయకులు

వీణవంక, జనవరి 13: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు స్థానిక నాయకులు, నిర్వాహకులు బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 12న ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్‌లో సుమారు 25 జట్లు పోటీపడగా, మల్లారెడ్డిపల్లి జట్టు మొదటి స్థానం సాధించగా రూ.10 వేల నగదు, షీల్డ్, వీణవంక జట్టు రెండో స్థానంలో నిలువగా, రూ.5 వేలు, షీల్డ్‌ను మాజీ సర్పంచ్ చిన్నాల ఐలయ్య, బీఆర్‌ఎస్ పార్టీ గ్రామాధ్యక్షుడు తాళ్లపెల్లి మహేశ్, స్థానిక నాయకులు, నిర్వాహకులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు ముజ్జు, కర్రె నాని, దాసారపు శ్రీకాంత్, సంతోష్, శ్యామ్, పవన్, రాజు, రాము, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ట్రినిటి విద్యార్థిని ప్రతిభ

కొత్తపల్లి, జనవరి 13 : మహారాష్ట్రలోని సేలంపూర్‌లో ఈ నెల 14 నుంచి 18 వరకు జరుగనున్న అండర్-19 జాతీయస్థాయి యోగా పోటీలకు ట్రినిటి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని శ్రీచరణి ఎంపికైంది. ఇటీవల మహబూబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్న శ్రీ చరణి అద్భుత ప్రతిభ చూపడంతో జాతీయ పోటీలకు అర్హత సాధించింది. విద్యార్థినిని ట్రినిటి కళాశాల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, పీడీ, అధ్యాపకులు అభినందించారు.

మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

తెలంగాణచౌక్, జనవరి 13: మహిళా రక్షణ కోసం రూపొందించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేశ్ పటేల్, ఐద్వా జిల్లా కార్యదర్శి నాగమణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ, దేశంలో మహిళలపై దాడులు పెరుగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత గిరిజ ఆదివాసి మహిళలపై దాడులు జరుగుతున్నా అక్కడి ప్రభుత్వాలు కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. మహిళలపై జరిగే అఘాయిత్యాల మీద ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.